ఎంజీ వాహన ధరల పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4:ఎంజీ మోటర్ ఇండియా కూడా వాహన ధరల పెంపు జాబితాలోకి చేరింది. వచ్చే ఏడాది నుంచి అన్ని రకాల వాహన ధరలను పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు కమోడిటీ ఉత్పత్తుల ధరలు అధికమవడం వల్లనే వాహన ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వాహన ధరలను ఎంతమేర పెంచుతున్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇప్పటికే మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆడీ ఇండియా, టాటా మోటర్స్, మెర్సిడెజ్ బెంజ్‌లు తమ వాహన ధరలను పెంచుతున్నట్టు ఇదివరకే ప్రకటించాయి.

బీవోబీ 5 వేల కోట్ల సేకరణ

హైదరాబాద్, డిసెంబర్ 4: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) రూ.5 వేల కోట్ల నిధులను సమీకరించింది. మౌలిక సదుపాయాల కోసం, గృహ రుణాల వితరణ చేయడానికి దీర్ఘకాలిక బాండ్లను జారీ చేయడంతో ఈ భారీ స్థాయిలో నిధులను సేకరించినట్టు బ్యాంక్ పేర్కొంది. మొత్తం ఇష్యూ సైజు రూ.5 వేల కోట్లు కాగా, బిడ్డింగ్‌లు మాత్రం రూ.10,350 కోట్లు వచ్చాయని వెల్లడించింది. కూపన్ రేటును 7.68 శాతంగా నిర్ణయించింది. మెచ్యూరిటీ 10 ఏండ్లు. బ్యాంక్ జారీ చేసిన ఈ బాండ్లకు క్రిసిల్, ఇండియా రేటింగ్‌లు ఏఏఏ ఇచ్చాయి.

జీఎస్టీ సగటు వసూళ్లు 1.66 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: జీఎస్టీ వసూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. జూలై 1, 2017న అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సరాసరిగా ఒక్కో నెలలో రూ.1.66 లక్షల కోట్ల మేర వసూలయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా వెల్లడించారు. లోకసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రతినెలలోనూ రూ.1.50 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయని, ఏప్రిల్ 2023లో అయితే రికార్డు స్థాయి రూ.1.87 లక్షల కోట్లు వచ్చాయని పేర్కొన్నారు. 2023-23 ఆర్థిక సంవత్సరంలో సగటు రూ.1.66 లక్షల కోట్లు కాగా, ఏడాది క్రితం వసూలైన దాంతో పోలిస్తే ఇది 11 శాతం అధికమని మంత్రి చెప్పారు. 2021-22లో సగటు రూ.1.23 లక్షల కోట్లు కాగా, అదే 2022-23లో రూ.1.50 లక్షల కోట్లు, 2020-21లో రూ.94,734 కోట్లుగా ఉన్నాయి.

రికార్డు స్థాయికి పసిడి ధర

తులం రూ.64,300 • హైదరాబాద్‌లో రూ.440 పెరుగుదల • రూ.83,500 వద్దే వెండి

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: బంగారం ధర మరో ఆల్‌టైమ్ హై రికార్డుకు చేరింది. రోజుకింత పెరుగుతూ మార్కెట్‌లో గోల్డ్ రేట్లు ప్రకంపనల్నే సృష్టిస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో తులం ఇంకో రూ.440 ఎగిసింది. ఫలితంగా క్రితమెన్నడూ లేనట్టుగా 24 క్యారెట్ పసిడి 10 గ్రాములు రూ.64,200ను తాకింది. ఆభరణాలు తయారు చేయడానికి వినియోగించే 22 క్యారెట్ పుత్తడి రేటు కూడా రూ.400 ఎగబాకి రూ.58,850ని చేరుకున్నది. ఇదిలావుంటే ఢిల్లీలోనూ బంగారం ధరలు పరుగులు పెట్టాయి. రూ.450 పుంజుకొని రూ.64,300 వద్ద 24 క్యారెట్ పసిడి ధర స్థిరపడింది. అలాగే 22 క్యారెట్ 10 గ్రాములు రూ.410 పెరిగి రూ.58,950గా నమోదైంది.

దూకుడుగా..

పసిడి ధరలు గతకొద్ది రోజుల నుంచి క్రమేణా పెరుగుతూపోతున్నాయి. హైదరాబాద్ విషయానికే వస్తే.. గడిచిన రెండు వారాల్లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.2,000, 22 క్యారెట్ రూ.1,750 మేరకు ఎగిసినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రోజుకో ఆల్‌టైమ్ హై రికార్డు నమోదవుతున్నట్టు మార్కెట్ వర్గాలు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి. కాగా, వరుస పండుగల సీజన్‌కు పెండ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో మార్కెట్‌లో గోల్డ్ సేల్స్ బాగా జరుగుతున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. ఇక నిరుడుతో పోల్చితే ఈసారి ధంతేరాస్‌కు బంగారం అమ్మకాలు పుంజుకున్న సంగతి విదితమే. కడ్డీలు, నాణేలు, నగల కొనుగోళ్లకు అన్ని వర్గాలవారు ఆసక్తి కనబర్చారు.

వెండి ధర అక్కడే..

మార్కెట్‌లో బంగారం ధరలు దూసుకుపోతే.. వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయి. సోమవారం కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.83,500 వద్దే ఉన్నది. అయినప్పటికీ గడిచిన 10 రోజుల్లో రూ.4,500 పెరగడం గమనార్హం. కాగా, ఢిల్లీలో రూ.80,200గా ఉన్నది. సాధారణ కొనుగోలుదారులతోపాటు పరిశ్రమల నుంచీ డిమాండ్ ఉండటంతో ఇన్ని రోజులూ ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్తున్నారు. అయితే ధరలు స్థిరంగా ఉంటేనే వ్యాపారం ఎక్కువగా అవుతుందని, ఒడిదుడుకుల్లో సాగితే కొనుగోలుదారులు వేచిచూసే ధోరణినే అవలంభిస్తారని, అప్పుడు అమ్మకాలు ఉండబోవని అంటున్నారు. ధరల్లో స్థిరత్వం చోటు చేసుకుంటే కొనుగోలుదారులనుంచి మళ్లీ డిమాండ్ రావచ్చన్నారు.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ ధర 2,077 డాలర్లకు చేరింది. సిల్వర్ రేటు 25.40 డాలర్లు పలికింది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ మారకం విలువ, వడ్డీరేట్లపై ఫెడరల్ రిజర్వ్ వైఖరి ఇన్వెస్టర్లను అమితంగా ప్రభావితం చేస్తున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు కామెక్స్‌లోనూ స్పాట్ గోల్డ్ రేటు 6 డాలర్లు పెరిగి 2,077 డాలర్లుగా నమోదైంది. అయితే సోమవారం ట్రేడింగ్‌లో ఒకానొక దశలో ఏకంగా 2,146 డాలర్లను తాకి సరికొత్త ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పడం విశేషం. మిడిల్ ఈస్ట్‌లో రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు పెరుగుతుండటమే ఇందుకు కారణమని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ధరలు మరింత పెరుగవచ్చంటున్నారు.

దుమ్ములేపిన మార్కెట్

సూచీల సరికొత్త రికార్డులు • సెన్సెక్స్ 1,384 పాయింట్ల ర్యాలీ • నిఫ్టీ 419 పాయింట్లు జంప్

ముంబై, డిసెంబర్ 4: మూడు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో సోమవారం స్టాక్ మార్కెట్ పెద్ద ఎత్తున ర్యాలీ జరిపి పలు రికార్డులు నెలకొల్పింది. రెండు ప్రధాన సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠస్థాయిని అందుకున్నాయి. బీఎస్ఈ సెన్సెక్స్ అవలీలగా 68వేల శిఖరంపై పాగా వేయగా, నిఫ్టీ 20,600 పాయింట్ల స్థాయిని అధిగమించింది. సెన్సెక్స్ 1,384 పాయింట్లు (2 శాతం) లాభపడి 68,918 పాయింట్ల వద ముగియగా, నిఫ్టీ 419 పాయింట్లు ఎగిసి 20,687 పాయింట్ల వద్ద నిలిచింది. 2022 మే 20 తర్వాత ఇంత పెద్ద ర్యాలీ జరగడం ఇదే ప్రథమం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించడంతో పాజిటివ్ సెంటిమెంట్ నెలకొందని, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్ల దిగువకు తగ్గడం ర్యాలీకి తోడ్పడ్డాయని విశ్లేషకులు తెలిపారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడుతుందన్న అంచనాలు ర్యాలీకి పురికొల్పాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

బ్యాంక్‌లకు భారీ లాభాలు

తాజా మార్కెట్ ర్యాలీకి బ్యాంక్‌లు నేతృత్వం వహించాయి. సెన్సెక్స్-30 షేర్లలో అన్నింటికంటే అధికంగా ఐసీఐసీఐ బ్యాంక్ 4.68 శాతం, ఎస్బీఐ 3.99 చొప్పున పెరిగాయి. కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు సైతం 3 శాతంపైగా లాభపడ్డాయి. బ్యాంక్‌లతో పాటు ఇంజనీరింగ్ దిగ్గజం లార్సన్ అండ్ టుబ్రో 3.9 శాతం పెరిగి కొత్త రికార్డుస్థాయి 3,316 వద్ద ముగిసింది. లార్జ్ క్యాప్ షేర్లతో పోలిస్తే మిడ్, స్మాల్‌క్యాప్ షేర్ల ర్యాలీ పరిమితంగా ఉంది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.20 శాతం చొప్పున పెరిగాయి. వివిధ రంగాల సూచీల లాభాల్ని పరిశీలిస్తే అత్యధికంగా ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 3.77 శాతం పెరగ్గా, బ్యాంకెక్స్ 3.56 శాతం ఎగిసింది. పవర్ ఇండెక్స్ 2.99 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచి 2.98 శాతం, యుటిలిటీస్ 2.94 శాతం చొప్పున పెరిగాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు ర్యాలీలో పాలు పంచుకున్నాయని, బ్యాంకింగ్ దిగ్గజాలు గరిష్ఠలాభాల్ని సాధించాయని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. వచ్చే కొద్ది రోజుల్లో స్మాల్, మిడ్‌క్యాప్‌లను లార్జ్‌క్యాప్ షేర్లు అవుట్‌పెర్ఫార్మ్ చేస్తాయని ఎమ్కే గ్లోబల్ ఫైనాన్షియల్ బిజినెస్ హెడ్ జయకృష్ణ గాంధి అన్నారు. బ్యాంకింగ్ షేర్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై బుల్లిష్ అంచనాల్ని వెల్లడించారు.

సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్లు

ఇటు దేశీయ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్, అటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరిపారు. స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారం ప్రకారం సోమవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ. 2,073 కోట్ల విలువైన షేర్లను నికరంగా కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు అంతకు రెట్టింపునకు పైగా రూ. 4,797 కోట్లు పెట్టుబడి చేశారు.

రూ.5.81 లక్షల కోట్లు పెరిగిన సంపద

సోమవారం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సంపద రూ.5.81 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ కొత్త రికార్డుస్థాయి రూ.343.48 లక్షల కోట్లకు చేరింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో ఇన్వెస్టర్ల సంపద రూ.14.76 లక్షల కోట్లు పెరిగింది. డాలర్ల రూపేణా గత శుక్రవారమే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ తొలిసారిగా 4 ట్రిలియన్ డాలర్లను అధిగమించిన సంగతి తెలిసిందే.

నిఫ్టీ 21,000 దిశగా

నిఫ్టీ భారీ గ్యాప్‌అప్‌తో ప్రారంభమై, ముగింపు సమయానికి మరింత పెరగడం సాంకేతికంగా సానుకూలాంశమని, వచ్చే కొద్ది రోజుల్లో ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే చెప్పారు. పుట్ ఆప్షన్ పొజిషన్లు హయ్యర్ స్ట్రైక్ స్థాయిలకు మారిన నేపథ్యంలో సమీప భవిష్యత్తులో మరిన్ని లాభాల్ని చూసే ఛాన్స్ ఉందని అంచనా వేశారు. 20,400 దిగువకు తగ్గనంతవరకూ నిఫ్టీ 21,000 స్థాయిని అందుకునే అవకాశాలున్నాయని విశ్లేషించారు.

సంస్కరణలు నెమ్మదిస్తాయ్..!

విధానపరమైన నిర్ణయాలుండవ్

విచ్చలవిడి రాజకీయాలతో దెబ్బేనంటున్న ఫిచ్

వచ్చే ఏడాది భారత్‌సహా అనేక దేశాల్లో ప్రధాన ఎన్నికలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: విచ్చలవిడి రాజకీయాలతో సంస్కరణలు నెమ్మదిస్తాయని, విధానపరమైన నిర్ణయాలు ఉండబోవని ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ హెచ్చరించింది. వచ్చే ఏడాది భారత్‌సహా అనేక దేశాల్లో కీలక ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫిచ్ రేటింగ్స్ సోమవారం పైవిధంగా స్పందించింది. వివాదాస్పద రాజకీయాలు దీర్ఘకాలిక వృద్ధిరేటుకు గొడ్డలి పెట్టుగా మారుతాయని కూడా ఈ సందర్భంగా ఫిచ్ అభిప్రాయపడింది. స్వల్పకాలిక వృద్ధికే ప్రాధాన్యతల్ని పెంచుతాయన్నది. భారత్, బంగ్లాదేశ్, క్రొయేషియా, డొమికన్ రిపబ్లిక్, ఈఐ సాల్వెడార్, ఇండోనేషియా, కొరియా, మెక్సికో, పాకిస్తాన్, పనామా, రొమేనియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, తైవాన్, అమెరికాల్లో 2024లో పార్లమెంట్, అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. 2025 జనవరిలో బ్రిటన్‌లోనూ ఎన్నికలు జరుగబోతున్నాయి. దీంతో తమ తాజా 'గ్లోబల్ సావరిన్స్ ఔట్‌లుక్ 2024' రిపోర్టులో రాజకీయ పార్టీల తీరు, గెలిచి ప్రభుత్వాలను ఏర్పాటుచేసేవారి శైలిపట్ల ఫిచ్ స్పందించింది.

చమురు ధరలపై..

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడుల వంటివి అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలను ఎగదోస్తాయని ఫిచ్ అన్నది. క్రూడాయిల్ రేట్లు పైపైకిపోతే ఆయిల్ ఎగుమతిదారులు, దిగుమతిదారులకు క్రెడిట్ సమస్యలూ ఏర్పడుతాయంటున్నది. మొత్తానికి చమురు ధరల్లో పెరుగుదల.. యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పురోగతికే ఇబ్బందికరంగా మారుతుందని హెచ్చరించింది. ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీలో కీలకమైన భారత్.. దేశీయ చమురు అవసరాల కోసం విదేశాల నుంచి దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మరెన్నో దేశాల పరిస్థితీ ఇంతే. ఈ క్రమంలోనే చమురు ధరల్లో పెరుగుదల.. ఆయా దేశాల్లో ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, జీడీపీ క్షీణతలకు దారితీస్తుందని చెప్తున్నారు. ఇక ఈ ఏడాది ప్రపంచ వృద్ధిరేటు దాదాపు 3 శాతంగా ఉండొచ్చన్న ఫిచ్.. వచ్చే ఏడాది 2 శాతానికే పరిమితం కావచ్చన్నది. సావరిన్ క్రెడిట్‌కు వాస్తవిక వృద్ధిరేటు, వడ్డీరేట్లు రెండు స్థూల ఆర్థికాంశాలుగా పేర్కొన్నది.

ఏఏఏఐ డైరెక్టర్‌గా రెండోసారి శ్లోకా ఎండీ శ్రీనివాస్

హైదరాబాద్, డిసెంబర్ 4: బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆఫ్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) డైరెక్టర్‌గా మరోమారు శ్లోకా అడ్వర్టైజింగ్ ఎండీ, సీఈవో కే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తెలంగాణ, ఏపీకి చెందిన శ్రీనివాస్‌కు అడ్వర్టైజింగ్, మార్కెటింగ్ రంగాల్లో 30 ఏండ్ల అనుభవం ఉన్నది. ఈ క్రమంలోనే వరుసగా రెండోసారీ ఏఏఏఐ సారథ్య బాధ్యతల్ని అందుకున్నారు. 'ఈ ప్రతిష్ఠాత్మక అసోసియేషన్ బోర్డుకు మళ్లీ ఎన్నికవడం చాలా సంతోషంగా ఉన్నది. సభ్యులందరి సహకారంతో నాకిచ్చిన బాధ్యతల్ని నెరవేరుస్తా' అని శ్రీనివాస్ అన్నారు. కాగా, అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధ్యక్షుడిగా గ్రూప్ ఎం మీడియా దక్షిణాసియా సీఈవో ప్రశాంత్ కుమార్ మళ్లీ ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా హవాస్ మీడియా రాణా బరువా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వచ్చే 3 త్రైమాసికాల్లో ఐటీ నియామకాలు అంతంతే

• **మందగించనున్న కంపెనీల వృద్ధి: ఇక్రా**

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ రంగం వృద్ధి మందగిస్తుందని, దీంతో వచ్చే మూడు త్రైమాసికాల్లో ఈ కంపెనీల్లో నియామకాలు అంతంతమాత్రంగానే ఉంటాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. 2023-24లో ఐటీ రంగం వృద్ధి 3-5 శాతానికి పరిమితమవుతుందని, 2024-25లో 6 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. ఐటీ పరిశ్రమ 2022-23లో 9.2 శాతం వృద్ధిచెందింది. ఐటీ సేవలకు డిమాండ్ బలహీనంగా ఉన్నందున, ప్రస్తుత సిబ్బంది నుంచే గరిష్ఠ ఉత్పాదకతను రాబట్టుకోవడంలో కంపెనీలు దృష్టిపెడతాయని పేర్కొంది. ఐటీ రంగానికి పెద్ద మార్కెట్లయిన యూఎస్, యూరప్‌లు స్థూలఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయన్నది. దేశీయ ఐటీ రంగానికి 60 శాతం ఆదాయాన్ని ఇచ్చే యూఎస్‌లో ఐటీ వలి త్రైమాసికాల్లో డిమాండ్ నెమ్మదిస్తున్నదని తెలిపింది. యూఎస్‌కంటే యూరప్ మార్కెట్ కాస్త స్థిరంగా ఉన్నప్పటికీ, అక్కడ కూడా వృద్ధి పరిమితంగానే ఉంటున్నదని వెల్లడించింది.

తగ్గుతున్న వలసలు

ఐటీ పరిశ్రమలో ఉద్యోగుల వలసలు గత ఏడాది మూడో త్రైమాసికం నుంచి తగ్గుతున్నాయని ఇక్రా తెలిపింది. 2020-21 నాల్గవ త్రైమాసికం నుంచి 2022-23 రెండవ త్రైమాసికం వరకూ వలసలు విపరీతంగా పెరిగాయన్నది. ఈ నేపథ్యంలో గతంలో నియామకాలు జోరుగా జరిపిందున, ఆయా కంపెనీల వేతన బిల్లులు పెరిగి, ఆపరేటింగ్ లాభాల మార్జిన్లపై ప్రభావం పడుతున్నదని వివరించింది.

ఐపీవోకి యాక్సెంట్ మైక్రోసెల్

హైదరాబాద్, డిసెంబర్ 4: ఫార్మా విడిభాగాల తయారీ సంస్థ యాక్సెంట్ మైక్రోసెల్.. స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఈ నెల 8 నుంచి మూడు రోజులపాటు సాగనున్న షేర్ శ్రేణి ధరను రూ.133-140గా నిర్ణయించింది. ఈ నెల 7న యాంకర్ పెట్టుబడిదారులకోసం షేర్లను విక్రయించనున్న సంస్థ.. మొత్తం ప్రక్రియ 12న ముగియనున్నదని పేర్కొంది. రూ.10 ముఖ విలువ కలిగిన 56 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుండటంతో రూ.78.40 కోట్ల నిధులు సమకూరవచ్చునని అంచనావేస్తున్నది.

• **నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సంధాయక్**

దేశంలోనే అతిపెద్ద సర్వేనౌక ఐఎన్ఎస్ సంధాయక్ సోమవారం భారత నౌకాదళంలో చేరింది. దీనిని స్వదేశంలోనే డిఫెన్స్ పీఎస్‌యూ గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, ఇంజినీర్స్(జీఆర్ఎస్ఈ) లిమిటెడ్ సంస్థ తయారుచేసింది. నౌకాదళం కోసం జీఆర్ఎస్ఈ తయారుచేస్తున్న నాలుగు సర్వే నౌకల్లో సంధాయక్ నౌక మొదటిదని అధికారులు వెల్లడించారు. నేవీ డే సందర్భంగా సోమవారం ఈ నౌకను నౌకాదళానికి అందజేసినట్టు పేర్కొన్నారు.-కోల్‌కతా

కదులుతున్న భారీ మంచుకొండ!

పరిమాణంలో న్యూయార్క్ నగరమంత పెద్దది

న్యూయార్క్: అంటార్కిటికా నుంచి విడిపోయిన ప్రపంచంలోనే అతిపెద్ద మంచుకొండ మహాసముద్రంలో ముందుకు కదులుతున్నది. 'ఏ23ఏ'గా పిలుస్తున్న ఈ ఐస్‌బర్గ్ న్యూయార్క్ నగరమంత పరిమాణంలో ఉన్నదని, మూడు దశాబ్దాల తర్వాత మొదటిసారి ముందుకు కదులుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దాదాపు 4వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఈ కొండ అంటార్కిటికా మహాసముద్రంలో ప్రమాదకరంగా ముమ్ముందుకు దూసుకెళ్తున్నట్టు తేల్చారు. ఇది పశ్చిమ అంటార్కిటికా నుంచి 1986లో విడిపోయింది. అప్పటినుంచీ కదలకుండానే ఉన్నది. అయితే, ట్రిలియన్ మెట్రిక్ టన్నుల బరువున్న ఈ మంచుకొండ బలమైన గాలులు, ప్రవాహాల వల్ల ఇటీవల అంటార్కిటికా ద్వీపకల్పం ఉత్తరకొనను దాటి ముందుకు కదులుతున్నట్టు గుర్తించారు.

సోలో బతుకు వద్దు బ్రదరూ!

పెండ్లి, పిల్లల పట్ల యువతలో నిరాసక్తతపై ప్రపంచ దేశాల్లో ఆందోళన

జనాభా సంక్షోభం వస్తుందని గుబులు • ఆర్థిక వ్యవస్థ కూలుతుందని భయం

పిల్లల్ని కనాలంటూ యువతకు ఆఫర్లు • చైనాలో వారం పాటు లవ్ హాలిడేస్

జపాన్‌లో నగదు ప్రోత్సాహకాలు • కనీసం 8 మందిని కనాలని పుతిన్ పిలుపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరు.. భర్తగా మారకు బ్యాచిలరు.. షాదీ మాటే వద్దు గురూ.. సోలో బతుకే సో బెటరూ'.. 'మనీ' సినిమాలోని ఈ పాటను విదేశీ యువత తెగ ఫాలో అయిపోతున్నారు. పెండ్లి చేసుకుంటే ఖర్చు.. పిల్లలు పుడితే వాళ్ల పెంపకం, చదువులకు మళ్లీ ఖర్చు.. జీతం చూస్తే, తక్కువాయె.. దీంతో చాలామంది పెండ్లిని పక్కన పెడుతున్నారు. మరికొందరు పెండ్లి చేసుకొన్నా.. సంతానాన్ని వద్దనుకొంటున్నారు. ఇప్పుడు ఇదే అక్కడి దేశాధినేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. జనాభా సంక్షోభం తలెత్తితే సామాజిక సమతౌల్యం దెబ్బతినడమే కాకుండా.. ఉత్పాదకత మీద ప్రభావం పడుతుందని, తద్వారా ఆర్థికాభివృద్ధి పడకేస్తుందని భయపడిపోతున్నారు. దీంతో జనాభాను పెంచుకొనేందుకు కొన్ని దేశాలు పౌరులకు ఆఫర్లు ప్రకటిస్తుంటే, ఇంకొన్ని దేశాలు హాలీడేస్ ఇస్తున్నాయి. మరికొన్ని దేశాలు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నాయి.

ఎక్కువ మందిని కంటే రష్యాలో రాయితీలు

రష్యా జనాభాను పెంచడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఇటీవల అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. మహిళలు ఎనిమిది అంతకంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మంది పిల్లలను కనే జంటలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు, హాలీడే ప్రయాణాల్లో రాయితీలు కల్పించేందుకు కసరత్తు చేస్తున్నట్టు అక్కడి అధికారులు తెలిపారు.

జపాన్‌లో సబ్సిడీలు

కిందటేడాది జపాన్‌లో 15 లక్షల మరణాలు నమోదైతే, జననాలు మాత్రం 8 లక్షలే. జనాభా సంక్షోభం అక్కడ ఏ స్థాయిలో ఉన్నదో దీన్నిబట్టి అర్థంచేసుకోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రస్తుతం 12.5 కోట్లు ఉన్న జపాన్ జనాభా 2060 నాటికి 8.6 కోట్లకు పడిపోతుంది. దీంతో జనాభాను పెంచడంలో భాగంగా ప్రజలను ప్రోత్సహించడానికి ప్రభుత్వమే ఓ ప్రత్యేక ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేసింది. పిల్లల్ని కనే వారికి ప్రభుత్వ సబ్సిడీలు, నగదు ప్రోత్సాహకాలు, పిల్లల ఆలనాపాలన చూసుకొనేందుకు ప్రత్యేకంగా సెలవులు ఇస్తున్నారు.

చైనాలో వేతనంతో కూడిన హాలీడేలు

జనాభా అంటే గుర్తొచ్చే చైనాలో.. 1980ల్లో తీసుకొచ్చిన ఏక సంతాన విధానం కారణంగా జననాల రేటు భారీగా తగ్గిపోతున్నది. 60 ఏండ్ల తర్వాత మొదటిసారి 2022లో చైనా జనాభాలో తగ్గుదల నమోదైంది. గత కొన్నేండ్లుగా జనాభా తగ్గుదలతో అప్రమత్తమైన చైనా 2015లో ఏక సంతాన విధానం తొలగించి ఇద్దరిని కనవచ్చని చెప్పింది. 2021 నుంచి ముగ్గురిని కనాలని చెప్తున్నది. ప్రభుత్వం ఏం చెప్పినా చైనా యువత మాత్రం పెండ్లివైపు మొగ్గు చూపడం లేదు. దీంతో విద్యార్థులు ప్రేమలో పడేందుకు అక్కడి తొమ్మిది కాలేజీలు వారం పాటు సెలవులు ప్రకటించాయి. మరికొన్ని కంపెనీలు ఉద్యోగులకు 'లవ్ హాలీడేస్' పేరిట వేతనంతో కూడిన సెలవులను ఇస్తున్నాయి.

దక్షిణ కొరియాలో ప్రత్యేక టీవీ షోలు

ప్రపంచంలో తక్కువ సంతానోత్పత్తి ఉన్న దేశంగా దక్షిణ కొరియా మారుతున్నది. ఆ దేశ సంతానోత్పత్తి రేటు 0.79 మాత్రమే. ఒకవైపు తగ్గిపోతున్న సంతానోత్పత్తి రేటు వల్ల దేశం జనాభా సంక్షోభంతో ఉంటే అక్కడ యువత అసలు పెండ్లిళ్లకే ఇష్టపడటం లేదు. ఖర్చులే దీనికి కారణంగా తెలుస్తున్నది. దీంతో యువతను పెండ్లి వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టీవీ షోలు ఏర్పాటు చేస్తున్నది.

రూ. 83కే ఇండ్లు ఇస్తామంటున్న ఇటలీ

జనాభా పెరుగుదలకు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో ఇటలీ ప్రభుత్వాధికారులు వినూత్న నిర్ణయం తీసుకొన్నారు. ఎవరైనా తమ నగరాల్లో కనిష్ఠంగా మూడేండ్లపాటు ఉండి ఉద్యోగాలు చేసుకొంటే.. తామే 30 వేల డాలర్లు (రూ. 25 లక్షలు) ఎదురు చెల్లిస్తామని, అలాగే, పౌరసత్వం, ఒక డాలర్‌కే (రూ. 83) ఉండటానికి ఇండ్లు ఇస్తామని ప్రకటించారు. పుగ్లియా, కలబ్రియా వంటి ప్రాంతాల్లోని స్థానిక ప్రభుత్వాలు ఇప్పటికే ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశాయి.

ఎక్కువ మందిని కనండి: కిమ్

జననాల రేటు తగ్గుతుండటంపై ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆందోళన చెందుతున్నారు. పతనమవుతున్న జననాల రేటుకు అడ్డుకట్ట వేయవలసిన బాధ్యత మహిళలపై ఉందని చెప్పారు. జనాభా వివరాలను ఉత్తర కొరియా చాలా వరకు గోప్యంగా ఉంచుతుంది. అయితే దక్షిణ కొరియా ప్రభుత్వ అంచనా ప్రకారం పదేళ్ల నుంచి ఉత్తర కొరియాలో జననాల రేటు క్రమంగా తగ్గుతున్నది. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన జాతీయ మాతృమూర్తుల సమావేశంలో కిమ్ మాట్లాడుతూ, ఎక్కువ మంది పిల్లలను కనాలని పిలుపునిచ్చారు.